



నేడు కదిరి చైర్‌పర్సన్‌పై...

# అవిశ్వాస తీర్మానం..!

◆ సమావేశం నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

◆ కౌన్సిలర్లకు విప్ జారీ చేసిన వైసిపి

◆ ఎన్నికల అధికారిగా ఆర్డీవో

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి వైసిపిలో ఏర్పడిన ముసలం ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వరకు వెళ్లింది. సొంత పార్టీ కౌన్సిలర్లే ఛైర్‌పర్సన్ తీరును వ్యతిరేకిస్తూ అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస పత్రంపై సంతకాలు చేసి ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నాడు అవిశ్వాస తీర్మానంపై చర్చ నడిపేందుకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కౌన్సిలర్లకు ఇప్పటికే సమావేశం నిర్వహణ సమాచారాన్ని అందజేశారు. సొంత పార్టీ కౌన్సిలర్లే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసంకు సిద్ధం కావడంతో నేడు జరిగే సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. మంగళవారం నాడు వైసీపీ కౌన్సిలర్లు ఎన్నికల అధికారి, ఆర్డీవోను కలిసి ఆ పార్టీ తరపున తమ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ పత్రాన్ని అందించారు. బుధవారం జరిగే అవిశ్వాసానికి మెజార్టీ కౌన్సిలర్లు మద్దతు తెలిపే అవకాశం కన్పిస్తున్న నేపథ్యంలో సమావేశం పూర్తి స్థాయిలో జరుగుతుందా.. లేక ఏవైనా ఆటంకాలు సృష్టించే అవకాశం ఉందాన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**మెజార్టీ కౌన్సిలర్ల వ్యతిరేకత**

కదిరి మున్సిపాల్టీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో వైసిపి 31 స్థానాల్లో గెలవగా, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైసిపికి చెందిన ఐదుగురు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ ప్రకారం మున్సిపల్ కౌన్సిల్‌లో టిడిపి బలం 11కి పెరిగింది. వైసిపికి 25 మంది మద్దతు ఉండగా వీరిలో చాలా మంది ఇప్పుడు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధం అయ్యారు. సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి ఓటేస్తే సంఖ్యాపరంగా ఛైర్‌పర్సన్ కూర్చీ దిగపోవడం ఖాయంగానే కన్పిస్తోంది.

**ముందు నుంచి వ్యతిరేకతే..!**

కదిరి ఛైర్‌పర్సన్‌పై ఆ ఆపార్టీ కౌన్సిలర్లలో ముందు నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఛైర్‌పర్సన్ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదంటూ సొంత పార్టీ కౌన్సిలర్లు పలుమార్లు బహిరంగ విమర్శలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోయి కూటమి అధికారంలోకి రావడంతో ఛైర్‌పర్సన్‌పై మరింత స్వరాన్ని పెంచారు. అందులో భాగంగానే సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

**పట్టణంలో సమస్యల తిష్ట**

కదిరి మున్సిపాల్టీలో సమస్యలు తిష్టవేశాయనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా అపరిశుభ్రత కన్పిస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన సాధారణ సమావేశాలను సైతం నిర్వహించడం లేదు. అభివృద్ధికి సంబంధించి నివేదికలు తయారు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి నిధులు కూడా మంజూరు కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేడు జరుగుతున్న ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రత్యేకతను సంతరించుకుంది.





మట్టి తవ్వకాలు జరపడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డ లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూమి

# లేపాక్షి హబ్ భూమి.. మట్టి మాఫియాకు అడ్డేది..?

◆ ఈడీ అటాచ్‌మెంట్ భూమిలో యథేచ్ఛగా తవ్వకాలు

◆ టన్నుల కొద్ది మట్టి తరలింపు

◆ పట్టించుకోని అధికార యంత్రాంగం

మట్టి మాఫియా కన్ను చిలమత్తూరు లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములపై పడింది. ఆ భూముల్లో మట్టిని తోడేసినా అడిగేవారుండరంటూ యథేచ్ఛగా టన్నుల కొద్ది తరలించేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రామాల పేరిట ఏకంగా హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టి కొత్తదందాకు తెరతీస్తున్నారు. పెద్దపెద్ద ప్రొక్లైనర్లు, ఐచర్ వాహనాలు పెట్టి టన్నుల కొద్ది మట్టిని తోడేస్తున్నారు. ఈ భూముల నుంచి బహిరంగంగానే మట్టి తరలి వెళ్తున్నా తమకేమీ సంబంధం లేదన్నట్లు సంబంధిత శాఖల అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

**అభివృద్ధి పేరిట అక్రమాలు..**

మండలంలో గ్రీన్ లైన్ హైవే, బెంగూళూరు హైవేను అనుసంధానం చేస్తూ సత్యసాయిజిల్లా జిల్లా కేంద్రం నుంచి హైవే పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పేరుతో రోడ్డు కాంట్రాక్టర్లు ఏకంగా లేపాక్షి హబ్ భూముల్లో నుంచి మట్టిని తోడేస్తున్నారు. ప్రతి రోజూ టన్నుల కొద్ది మట్టిని తోడి రవాణా చేసుకుంటున్నారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే తాము అభివృద్ధి కార్యక్రమానికే వాడుతున్నామనే సమాధానం విన్పిస్తున్నారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఎవరిచ్చారనేది మాత్రం సందేహాస్పదంగానే ఉంటోంది.

ప్రజాశక్తి-చిలమత్తూరు

పరిశ్రమల ఏర్పాటు పేరుతో చిలమత్తూరు మండల పరిధిలోని శెట్టిపల్లి రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 65,66,80లో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు రైతుల నుంచి కారుచౌకగా భూములను తీసుకున్నారు. ఎస్ఈజడ్ పేరుతో పేదల నుంచి అతి తక్కువ ధరకు భూములను సేకరించిన ఎపిఐఐసి ఆ భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కట్టబెట్టింది. వారు బ్యాంకుల్లో తనఖా పెట్టి పెద్ద అవినీతి కుంభకోణానికి తెరలేపారు. భూములైతే తీసుకున్నారు గానీ అక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ భూములు ఈడి అటాచ్‌మెంట్‌లో ఉన్నాయి. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న నేపథ్యంలో ఈ భూములను అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా భావించి మట్టిమాఫియా పెద్దపెద్ద వాహనాలతో మట్టిని తోడేస్తున్నారు.


లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల వద్ద ఉన్న ఇటాచీ

**అభివృద్ధి పేరిట అక్రమాలు..**

మండలంలో గ్రీన్ లైన్ హైవే, బెంగూళూరు హైవేను అనుసంధానం చేస్తూ సత్యసాయిజిల్లా జిల్లా కేంద్రం నుంచి హైవే పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పేరుతో రోడ్డు కాంట్రాక్టర్లు ఏకంగా లేపాక్షి హబ్ భూముల్లో నుంచి మట్టిని తోడేస్తున్నారు. ప్రతి రోజూ టన్నుల కొద్ది మట్టిని తోడి రవాణా చేసుకుంటున్నారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే తాము అభివృద్ధి కార్యక్రమానికే వాడుతున్నామనే సమాధానం విన్పిస్తున్నారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఎవరిచ్చారనేది మాత్రం సందేహాస్పదంగానే ఉంటోంది.

**మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి**



లేపాక్షి నాలెడ్జ్ హబ్ నుంచి ఆక్రమంగా మట్టిని తరలిస్తూ సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులపై ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలి. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు ఎప్పటికైనా రైతులకు తిరిగి ఇవ్వాల్సినవే. అలాంటి భూముల్లో అక్రమార్కులు మట్టిని తోడేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి.

**ఫిరంగి ప్రవీణ్‌కుమార్,**
**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.**

**అదే దారిలో రియల్టర్లు..!**

తమ వెంచర్లను చదును చేసుకునేందుకు రియల్టర్లు సైతం లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టిని తోడేసుకుంటున్నారు. ప్రయివేటు లే అవుట్‌లకు మట్టిని తరలించి వారి భూములను చదును చేసుకుంటున్నారు. సాధారణంగా లేఅవుట్‌కు మట్టిని ఉపయోగించాలంటే టన్నుల చొప్పున ప్రభుత్వానికి రుసుం చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. రియల్టర్లు ఇలాంటివి ఏమీ చేయకుండానే లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టిని తొడేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## పక్కా ప్రణాళికతో బాబా జయంతి ఉత్సవాలు

### సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

శ్రీ సత్య సాయి బాబా 100వ జన్మ దినోత్సవ ఉత్సవాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కా ప్రణాళికతో నిర్వహించేలా అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయసారథి, సత్యసాయి బాబా ట్రస్ట్ సభ్యులతో కలిసి బాబా ఉత్సవాలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నవంబర్‌లో జరగనున్న శ్రీ సత్య సాయి బాబా జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ రానున్న తరుణంలో పకడ్బందీగా అన్ని ఏర్పాట్ల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా ట్రస్టు సభ్యులతో కలిసి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, సత్య సాయి ట్రస్ట్ సభ్యులు చలం రోమల్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

### ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - గుడిబండ


ఖాళీబిందెలతో రోడ్డుపై బైటాయించిన మహిళలు

మండల పరిధిలోని జమ్మలబండ గ్రామానికి చెందిన పలువురు మహిళలు తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మడకశిర,అమరా పురం ప్రధాన రహదారి మీద ఖాళీ బిందెలతో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ చాలా రోజులుగా తమ గ్రామంలో తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించి తాగునీటిని తెచ్చుకుంటున్నామన్నారు. గతంలో తమ గ్రామానికి శ్రీరామ్ రెడ్డి తాగునీటి పైప్‌లైన్ ద్వారా తాగునీరు వచ్చేదన్నారు. ప్రస్తుతం అవి నిలిచిపోయాయన్నారు. అదనంగా ఓ బోరును వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో గంగాధర్ గ్రామానికి చేరుకుని గ్రామస్తుల సమస్యను అడిగితెలుసుకున్నారు.ఉన్నతాధికారులతో చర్చించి గ్రామంలో అదనంగా ఓ బోరు వేయడానికి చర్యలు తీసుకుంటామని వారం రోజుల్లోపు తాగునీటి సౌకర్యం కల్పిస్తామనిహామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జమ్ముల బండ గ్రామ మహిళలు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## సోషలిజమే ప్రత్యామ్నాయం

### లెనిన్ జయంతి వేడుకల్లో వి.రాంభూపాల్

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రపంచానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని చాటిన కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కామ్రేడ్ లెనిన్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. లెనిన్ 155 జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆయనకు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టేందుకు నాడు లెనిన్ చూపిన బాట చాలా అవసరం అన్నారు. చిన్నప్పటినుంచి ఆయన మార్క్సిజాన్ని అధ్యయనం చేసి ఆచరణలో అమలు చేశారని కొనియాడారు. ఆయన చూపిన దారి నేటి ఉద్యమాలకు ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, బాబావలి, గంగాధర్, మహబూబ్ బాషా, బావమ్మ, తిప్పన్న, ఊతప్ప, తిప్పన్న పాల్గొన్నారు.



కదిరిలో లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

**కదిరి టౌన్ :** ప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత, రష్యా విప్లవ నాయకుడు లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు ప్రజా సమస్యలను పక్కన పెట్టి కులం, మతం అంటూ ప్రజల మధ్య చీలిక తెస్తున్నారని తెలిపారు. ఇలాంటి పాలనను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24 నుంచి 26 వరకు నిరాహార దీక్షలు చేపట్టి, మే 5న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీ నారాయణ, జిఎల్.నరసింహులు, నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, రఫీ, సుధాకర్ రెడ్డి, పైపల్లి గంగాధర్, ఆంజనేయులు, తాజుద్దీన్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-హిందూపురం

చదువుతో పాటు మంచి నైపుణ్యం ఉన్న వారికి ఉపాది ఆవకాశాలు లభిస్తాయని మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ బాలాజీ విద్యా విహార్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, ఐటి కంపెనీలతో పాటు ఎలాక్ట్రానిక్స్, మోటారు కంపెనీలతో పాటు విప్రో, మెడ్ ప్లస్, కెఐఎంఎల్, డాక్టర్ రెడ్డీస్ తదితర 21 బహుళ జాతీయ కంపెనీలు హాజరయ్యాయి. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 252 మంది పాల్గొనగా ఇందులో ఆయా కంపెనీలకు 137 మంది ఎంపికైనట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ సంగం శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ వీరభద్రప్ప, ఆయా కంపెనీల ప్రతినిధులతో పాటు నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధులు చైతన్య, కె ఎస్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి సవిత


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. మంగళవారం రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో రొద్దం మండలం కలిపి, పెద్దమంతూరు, చిన్నమంతూరు, చెరుకూరు,నల్లూరు, చొలేమర్రి పంచాయతీల లోని నాయకులు కార్యకర్తలతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తమ గ్రామాల్లోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి నాయకులకు హామీ ఇచ్చారు. గ్రామంలో సమస్యలు ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు కార్యకర్తలకు తెలిపారు. పార్టీ ఆదేశించిన అన్ని కమిటీలను త్వరగా పూర్తీ చేయాలని వారికి చెప్పారు. నాయకులను కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహా రావు, మండల నాయకులు పాల్గొన్నారు.

**క్రిస్టియన్ విద్యార్థులకు త్వరలో విదేశీ విద్యా పథకం**

క్రిస్టియన్ విద్యార్థులకు విదేశీ విద్య పథకం త్వరలో అమలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామి దాస్ పలువురు పాస్టర్లు పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రైస్తవులకు శుభవార్త అందించారని అన్నారు. గతేడాది మే నుంచి నవంబరు వరకు పెండింగ్ లోని పాస్టర్ల గౌరవవేతనాన్ని సీఎం విడుదల చేయడం సంతోషకరమ న్నారు. త్వరలోనే సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, జెరూసలేం యా త్ర తదితర పథకాల అమలు చేస్తామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రూస్, క్రిస్టియన్ సెల్ నాయకులు శ్యాం, శామ్యూల్,బైబిల్ మిషన్ పాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**గోరంట్ల:** వ్యవసాయ, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు ఈ మేరకు మంగళవారం గుమ్మయ్య గారి పల్లి సర్కిల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతులకు గృహ అవసరాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తామన్నారు గ్రామాల్లో కూడా 11 కేబుల్ లైన్ వేసి 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందించడం జరుగుతుందన్నారు మండలంలో పరిశ్రమలు కుటీర పరిశ్రమలు ఉన్నాయనినాణ్యమైన విద్యుత్తును అందిస్తే ఉపాధి అందుతుందని చెప్పారు.ఈఉద్దేశంతోనే మండలంలో కొత్తగా 8 సబ్ స్టేషన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ నాయకులు బాలకృష్ణ, అశోక్, హరి, నిమ్మల శ్రీధర్, నరేష్, విద్యుత్ శాఖ సూపర్డెంట్ ఇంజనీర్లు సురేంద్ర, తిరుమల రావు, శివరాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ


బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో బావమ్మ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్ కు సంబంధించిన బుక్ లెట్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలన్నీ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్నవేనని ఇది సమరశీల కార్మికవర్గ చరిత్ర అని అన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, అతి తక్కువ వేతనాలతో పనిచేయడం, పని భద్రత లేకపోవడం లాంటి అనేక సమస్యలతో కార్మికవర్గం నేటికీ సతమతమవుతోందన్నారు. ఇప్పుడున్న కార్మిక హక్కులకు రక్షణ లేకుండా కార్మిక వర్గాన్ని అణచడానికి కుట్ర చేస్తుందన్నారు. సరళీకరణ విధానాల అమల్లో భాగమే లేబర్ కోడ్‌లు కార్మికవర్గంపై రుద్దడం అని అన్నారు. పెట్టుబడిదారులు అత్యంత లాభాలు ఆర్జించడానికే ఈ లేబర్ కోడ్స్ ని తీసుకువచ్చారన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే 29 కార్మిక చట్టాలు రద్దవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకోవడానికి కార్మికవర్గాన్ని నిరవధిక పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే సమరశీల, ఐక్యపోరాటం మే 20న జరిగే సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నాగరాజు, జయమ్మ, భాష, నరసింహులు, చిన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా గ్రీవెన్స్

**ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు**

మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి బుధవారం ప్రజాగ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు. నియోజవర్గ స్థాయిలో ప్రతి బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఓడి చెరువు ఐటిఐ కళాశాల ఆవరణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ గ్రీవెన్స్‌లో ఓడి చెరువు, నల్లమాడ ,ఆమడ గూరు మండలాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా గ్రీవెన్స్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పోస్టర్లు విడుదల

**ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు**

రాయల సీమ ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందనిఆర్ సి పి పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా విమర్శించారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్ని అమరావతి కేనా అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం అమడగూరు మండల కార్యదర్శి శ్రీనివాసులు, సీమ రైతు సంఘం నా రాష్ట్ర నాయకుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

నేటి తరం విద్యార్థులు చదువులలో రాణించి ఉన్నత శిఖరాల అధిరోహించి తాము చదివిన కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, విశ్రాంత డైట్ ప్రిన్సిపల్ మునయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవ వేడుకలను. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తాము చదివిన కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాల కళాశాల అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగదీష్, ఎస్‌బిఐ మేనేజర్ సంతోష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు శ్రీనివాసులు, శివ ప్రసాద్, దస్తగిరి, రాజ్ మహమ్మద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# 28 నుంచి వేసవి శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

ఈనెల 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కే జయరాం, తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖలు, పేపర్ హార్ట్ లో, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఈ కార్యక్రమాలు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు కావున విద్యార్థులు ఈ వేసవి శిబిరాలకు హాజరుకావాలని ఆయన కోరారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

భవిత పాఠశాలలో చదివే విద్యార్థులకు మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రామాంజులు యాదవ్ పఠన సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ పి కుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం పఠన సామాగ్రిని పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, శివయ్య, గోవర్ధన్ రెడ్డి, రమణా నాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన న్యాయవాదులు

**ప్రజాశక్తి - పావగడ**

తాలూకా న్యాయ సేవా సమితి, న్యాయవాదుల సంఘం, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని తుమకూరు రోడ్డులోని తిమ్మక్క ఉద్యానవనంలో సీనియర్ సివిల్ జడ్జి వి. మాధేష్ , అదనపు సివిల్ జడ్జి బి.ప్రియాంక మొక్కలు నాటి ఎర్త్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేషా నందన్ , బార్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ సన్నీరప్ప, అటవీశాఖ ఆర్ఎఫ్‌వో రాకేష్, అటవీశాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వీధిదీపాలు ఏర్పాటు చేయండి

**ప్రజాశక్తి - నల్లమాడ**

స్థానిక ఎస్సీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. వీధి దీపాలు లేకపోవటంతో రాత్రిపూట బయటకు రావటానికి భయపడుతున్నా మన్నారు.అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# రస్తా సమస్య పరిష్కారం

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

రస్తా కోసం రైతులు అర్జీలు ఇవ్వడంతో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించారు. మండలంలోని అప్రాచెరువు మజారా గుమ్మల్లకుంట , ఓబుళాపురం మజారా చిన్నేకుంటపల్లి, దంపెట్ల మజారా ఉప్పర్లపల్లి గ్రామాలకు సంబధించిన రైతులు తమ భూమికి రస్తా సమస్యను పరిష్కరించాలని ఇచ్చిన అర్జీ మేరకు ఆర్డీవో మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సరిహద్దు రైతులతో మాట్లాడి, వారి సమ్మతితో రస్తాను చూపించినట్లు ఆర్డీవో తెలిపారు. అదేవిధంగా దంపెట్ల మజారా ఉప్పర్లపల్లి గ్రామములోని రస్తా సమస్యను త్వరలో పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత , మండల సర్వేయరు , వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు , అర్జీదార్లు, సరిహద్దు రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం : కలెక్టర్



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఆరోగ్యమైన పిల్లలతో ఆరోగ్యమైన సమాజం నిర్మించడమే పోషణ అభియాన్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి లోని సాయిఆరామంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషణ పక్వాడ పోషణ ఆహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. పోషక వారోత్సవాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో 15 రోజులపాటు ఈ వేడుకలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పోషణ్ పక్వాడా 2025 అనేది మహిళలు పిల్లలపై ప్రధానంగా దృష్టి సారించి పోషకాహార భారత్ ను నిర్మించే దిశగా కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలతో పాటు సమాజాన్ని చైతన్య పరిచే దిశగా పలు అంశాలపై కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిపారు. గర్భిణులు ఆరోగ్య సూత్రాలను పాటించాల్సి ఉందని అలాగే ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలతో పాటు గిరిజన తండాలలో పోషణ్ పక్వాడ పై విస్తృతంగా అవగాహన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ తర్వాత పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని కలెక్టర్ చేతుల మీదుగా నిర్వహించారు. అలాగేసామూహిక సీమంతాలు జరిగాయి. చివరిగా పోషక వారోత్సవాల ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఐసిడిఎస్ శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న పోషణ పక్వాడ పోషక ఆహార స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప , 12 ప్రాజెక్టుల సిడిపిఒలు, పోషణ అభియాన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ సుదీష్ వర్మ డిసిపిఒ మహేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, డిసిపియు సిబ్బంది, ఓఎస్సీ సిబ్బంది, శిశుగృహ సిబ్బంది, ఐసిడిఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి కొత్తచెరువు**



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో ఏడీ రామకృష్ణకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ప్రైవేటు విద్యా సంస్థలు ప్రచారాలు చేయడం వల్ల ప్రభుత్వ విద్యా సంస్థలలో అడ్మిషన్లు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో రైతులు తమ పొలాల్లోకి సులభంగా చేరుకునేందుకు కొత్త రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు పాల్గొని టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణం వల్ల సాగుకు అనువైన రవాణా మార్గం అందుబాటులోకి రానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్ రాజు, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి జయంతి వేడుకలపై రత్నాకర్‌తో మంత్రి చర్చ

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**



రత్నాకర్‌తో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఈ ఏడాది నవంబర్లో జరిగే సత్యసాయి శతజయంతి వేడుకలు గురించి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ తో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చర్చించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సత్యసాయి మహా సమాధిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలో రత్నాకర్ కార్యాలయంలో మంత్రి చర్చించారు. శతజయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ప్రభుత్వపరంగా ఏయే కార్యక్రమాలు చేపట్టాలో అన్న విషయాలను తెలుసుకోవాలని సిఎం ఆదేశించిన నేపథ్యంలో మంత్రి రత్నాకర్ తో చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వపరంగా తగిన సహకారం ఉంటుందని ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని మంత్రి వివరించినట్లు తెలిసింది. అనంతరం రత్నాకర్ మంత్రికి సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నిలయంలో కురుబ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బులగుండ్ల శ్రీనివాసులు, ఎల్ఐసి బాబు, కేశని ఆదినారాయణ తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బాబా చిత్రపటాన్ని అందించారు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనపర్చింది. స్థానికసత్య సాయి నగర్‌లో కె ఎస్ ప్రకాష్, శ్యామల దంపతుల కుమార్తె కెఎస్. హేమా నందిని వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు సాధించింది. ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ధర్మవరానికి పేరు తీసుకురావటం తమకు ఆనందంగా ఉందని విద్యార్థిని తల్లిదండ్రులు అన్నారు. హైదరాబాదులోని రిజనాన్స్ మౌర్య కాలేజీలో ( గర్ల్స్ క్యాంపస్) చదువుతున్న హేమానందిని పదవ తరగతి ధర్మవరంలోని నాగులూరు గ్రామంలోని పిసిఎస్ఆర్ పాఠశాలలో చదివింది. ప్రస్తుతం హైమానందిని హైదరాబాదులోని అదే కళాశాలలో ఎంసెట్ కోచింగ్ శిక్షణలో ఉంది. విద్యార్థిని తండ్రి పుట్టపర్తి లోని ఎస్పీ ఆఫీసులో హోంగార్డ్ డిపిఒగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**నంబులపూలకుంట :** మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సొంగ రెడ్డప్పరెడ్డి కుమారుడు సొంగ భరత్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనపర్చాడు. 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించాడు. భరత్‌కుమార్‌రెడ్డి హైదరాబాదులోని మాదాపూర్ శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్నాడు.

**ముదిగుబ్బ** :మండలంలోని గాండ్లవారిపల్లికి చెందిన పార్నపల్లి లక్ష్మీనారాయణ, ప్రశాంతి దంపతుల కుమార్తె ప్రణతి తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభకనబరిచారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించిన యువతి ఎంపీసీలో వెయ్యిమార్కులకు 984 మార్కులు సాధించారు. యువతిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# నేటి నుంచి మద్దతు ధరతో రాగులు కొనుగోలు

## జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో రబీ సీజను లో రాగి పంటను సాగు చేసిన రైతుల నుంచి ఏపీ పౌర సరఫరాల సంస్థ ద్వారా కనీస మద్దతు ధరతో బుధవారం నుంచి రాగులు కొనుగోలు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదలైంది.కనీస మద్దతు ధర క్వింటాలకు 4290 రూపాయలకు రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ రబీ సీజన్లో రాగి పంటను ఈ క్రాప్ లో నమోదు చేసుకొని ప్రభుత్వానికి రైతులు అమ్మదలుచుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. గోనె సంచులు లోడింగ్ చార్జీలు రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోకుండా కనీస మద్దతు ధర పొందాలని కోరారు.

**హిందూపురం** :డివిజన్ వ్యాప్తంగా రబీ సీజన్ లో రాగి పంటను సాగు చేసిన రైతులు వద్ద నుండి పౌర సరఫరాల సంస్థ ద్వారా కనీస మద్దతు ధర క్వింటాలకు రూ.4290 మద్దతు ధరను చెల్లించి మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా రాగులు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ మంగళవారం తెలిపారు. ఈ రబీ సీజన్ లో రాగి పంటను ఈ క్రాప్ లో నమోదు చేసుకుని, ప్రభుత్వానికి పంటను అమ్మదలుచుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

# శాస్త్రీయ సమాజ నిర్మాణమే జెవివి లక్ష్యం

## జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి -ధర్మవరం రూరల్**

మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణమే జెవివి లక్ష్యమనిజన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. స్థానిక గణేష్ మున్సిపల్ హై స్కూల్ లో మంగళవారం యురేకా సైన్స్ ఎక్స్ పో విజేతల అభినందన సభను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు సంబరాలతో పాటు సైన్స్ ప్రయోగాల వీడియో కాంటెస్ట్ యురేకా సైన్స్ ఎక్స్పో కార్యక్రమం విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలను, దృక్పథాన్ని పెంచేందుకు దోహదపడతాయన్నారు. విజేతలు గా నిలిచిన డి.మేఘన, సి.తేజస్వినిని ఈసందర్భంగా అభినందించారు. మానవాళి ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం చూపేది సైన్స్ మాత్రమేనన్నారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యలో మూఢనమ్మకాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ మధ్య బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులు, పాలకులు సైన్స్ పేరుతో సుడో సైన్స్ ను ప్రచారం చేస్తూ ప్రజల్ని అయోమయంలోకి, మూఢనమ్మకాల్లోకి నెట్టేస్తున్నారన్నారు.. దీనిని గమనించి ప్రశ్నించాల్సిన అవసరం వుందన్నారు..ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి వై నరేంద్ర బాబు, నాయకులు రవీంద్రా రెడ్డి,సైన్స్ ఉపాధ్యాయులు శేఖర్, నలజల గోపీ,వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ తప్పనిసరి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**



రిటైర్డ్ ఉద్యోగి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి ఉద్యోగికి రిటైర్డ్‌మెంట్ తప్పనిసరి అనియుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర రెడ్డి అన్నారు. కదిరి మున్సిపాలిటీ గంగిరెడ్డి పల్లి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మైనుద్దీన్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కదిరి ఎంఇఒ చెన్నకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. మైనుద్దీన్ విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 ఓబుల్ రెడ్డి, నాగరాజు; సీనియర్ నాయకులు శ్రీనివాసులు, షఫీ, శ్రీమతి షమీమ్ భాను తదితరులు పాల్గొన్నారు.

# సిహెచ్ఒలను పర్మినెంట్ చేయాలి

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

వైద్య ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్ఎం కింద పనిచేస్తున్న సిహెచ్ఒలను పర్మినెంట్ చేయాలని సిహెచ్ఒలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలో పనిచేస్తున్న సిహెచ్ఒలు కలెక్టరేట్ ముందు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా కేవలం రూ. 25 వేల వేతనంతో పనిచేస్తున్నామన్నారు. తమను పర్మినెంట్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ ఉద్యోగం ఉన్నందున తమ కుటుంబాలకు ఏ ఒక్క ప్రభుత్వ సంక్షేమ పథకం అందడం లేదన్నారు. ఆరు సంవత్సరాలు దాటిన సిహెచ్ఒలను క్రమబద్ధీకరించాలని, ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రతి ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఇతర ఉద్యోగులతో సమానంగా టిఎ, డిఎ మంజూరు చేయాలని కోరారు. క్రమబద్ధీకరించే వరకు శాంతియుతంగా ఆందోళనలు చేపడుతూనే ఉంటామన్నారు. అనంతరం కలెక్టర్ టిఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ రెడ్డి, మమత, కృష్ణవేణి, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలను దూరం చేసుకోండి : ఎస్ఐ

**ప్రజాశక్తి- నంబులపూలకుంట**

మూఢ నమ్మకాలపై స్థానిక ఎస్ఐ వలిబాషా ఆధ్వర్యంలో మండల పరిధిలోని గౌకనపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజలు మూఢనమ్మకాలపై అపోహాలు వీడి ప్రశాంతమైన జీవితం సాగించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అంజనప్ప, నాయకులు సమీవుల్లా,గురివిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేకాట జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి - తలుపుల**

మండల పరిధిలోని పులి గ్రామం శివారులోని హెచ్ఎన్ఎస్ఎస్ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. వారివద్ద ఉన్న రూ11,700లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# బెల్లం ఊట ధ్వంసం

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

మండల పరిధిలోని మదిరే బైలు గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. నాటు సారా తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అశోక్, సోమశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటు సారా, 30 కేజీల బెల్లం సీజ్ చేశారు. వీరికి సహకరించే చిన్నప్ప, రామాంజనేయులు, బెల్లం సరఫరాదారుడు ఇజాజ్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నరసింహులు, నాగభూషణ, సురేష్ బాబు, ప్రసాద్,నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

కర్నాటక మద్యం అక్రమ రవాణా, నాటు సారా తయారీ, బెల్ట్ షాపుల నిర్వహణ చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్, నాగమద్దయ్య పేర్కొన్నారు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వారి కార్యాలయం లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య జిల్లాలో నాటుసారా నిర్మూలన కోసం , ప్రజల ఆరోగ్యం దష్ట్యా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం నవోదయం 2.0 అమలు తీరును సమీక్షించారు. అందులో భాగంగా పాత నేరస్తులను, అనుమానితుల పై నిఘా ఉంచాలని వారిని బైండోవర్ చేసి వారు మరలా నాటు సారాయి కేసుల్లో పట్టుబడితే జరిమానా చెల్లించేలా కఠినంగా వ్యవహరించాలని , చట్టానికి వ్యతిరేకంగా నాటుసారా తయారుచేసిన, రవాణా చేసిన పీడీ యాక్టు చట్టం ప్రయోగించేందుకు పేర్లు ప్రతిపాదించాలని తెలిపారు. కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో కర్నాటక మద్యం జిల్లాలోకి రవాణా కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి గోవింద్ నాయక్, శ్రీ సత్య సాయి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ , పుట్టపర్తి ఇన్స్పెక్టర్ నాగరాజు , జిల్లాలోని అన్ని స్టేషన్ల సిఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత

**ప్రజాశక్తి - అగళి**

అగళి ఏపి మోడల్ స్కూల్ నందు ఒకేషనల్ కోర్స్ లో 10 రోజులు బ్యూటీ అండ్ వెల్నెస్ ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 10 వ తరగతి విద్యార్థులకి మరియు 11,12 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్‌నాయుడు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జాఫర్, బ్యూటీ అండ్ వెల్నెస్ ఒకేషనల్ ఉపాధ్యాయురాలు ఆర్.నాగరత్నమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** ఇంటర్‌షిప్ లో చేసిన విద్యార్థులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి తెలిపారు ఎంఇఒ కృష్ణనాయక్ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశామన్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యా సంవత్సరానికి 2024 2025 సంవత్సరంలో దసరా సెలవుల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆటోమోటివ్ ట్రేడ్ ఇంటర్ షిప్ లో విద్యార్థులు మార్గ నిర్దేశం చేస్తూ విద్యలో వృత్తి విద్య శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, గంగాధర్, రాజగోపాల్, విశ్వనాథ్ రెడ్డి, హరి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జెడ్పిహెచ్ఎస్‌లో పదో తరగతి వొకేషనల్ విద్యార్థులకు దసరా సెలవుల్లో నిర్వహించిన 12 రోజుల ఇంటర్న్‌షిప్ విజయవంతమైంది. విద్యార్థులు కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు, ఫోటోగ్రఫీ స్టూడియోలలో నైపుణ్యాలపై శిక్షణ పొందారు. కార్యక్రమం ముగింపున మంగళవారం ప్రధానోపాధ్యాయులు వివేకానంద మూర్తి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దారెడ్డి, ఎర్రిస్వామి, ఒకేషనల్ ట్రైనర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బపై అవగాహన

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం బీడుపల్లి గ్రామంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, క్షయ వ్యాధి వడదెబ్బ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల ఎవరు నిర్లక్ష్యము వహించరాదని, ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వీలయినంత వరకు ప్రయాణాలు కానీ, పనులు కానీ ఉదయం 10 గంటలలోపు మధ్యాహ్నం 3 గంటల తరువాత ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాధ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

మండల పరిధిలోని స్టేట్ బ్యాంకు నందు ఖరీఫ్ సీజన్లో లో పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని బత్తలపల్లి శాఖ బ్యాంకు మేనేజర్ సుభాష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గడువులోగా రైతులు పంట రుణాలు రెన్యువల్ చేసుకుంటే వడ్డీలేని రుణం, బీమాకు అర్హులవుతారన్నారు. జూన్ 30 వరకు ఆయా గ్రామాల రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవాలన్నారు. గత ఏడాది పంట రుణం తీసుకున్న గడువులోగానే రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

# బిపిఎంపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాశక్తి-పెనుకొండ**

రాచువారిపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్ పై చర్యలు తీసుకోవాలని మలిగల బాబ్‌జాన్ అనే వ్యక్తి మంగళవారం పెనుకొండ ఐపిఒకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాబ్‌జాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 13వ తేదీన తన మొబైల్ ఫోన్ స్టేటస్ గా వైయస్సార్సీపి నాయకుల వీడియోలు ఉంచానన్నారు. దీంతో రాచువారిపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్లా (అబ్బు ) తనకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడి దాడి చేశాడన్నారు. ఈ విషయంపై ముదిగుబ్బ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిని అని మరచి విచక్షణ రహితంగా దాడి చేయడం బాధాకరమన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేసిన షేక్ అబ్దుల్లా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

**ప్రజాశక్తి - లేపాక్షి**

రేషన్ డీలర్లు కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ చౌకధాన్యపు డిపో నిర్వాహకులు, వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు లబ్ధిదారులు సకాలంలో అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ నాయక్, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

చదువులో రాణించి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సప్తగిరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ విద్యార్థులు, ఎంబిఎ, ఎంసిఎ సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, సప్తగిరి ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, కళాశాల పరిపాలనాధికారి గంగిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానివి ప్రచార ఆర్భాటాలు

## కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

**ప్రజాశక్తి ముదిగుబ్బ**

కూటమి ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటాలే తప్ప చర్యలు శూన్యమని మాజీ రాజ్య సభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి విమర్శించారు. ఈమేరకు ఆయన మంగళవారం ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మే నెల2వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతికి శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రావటం హర్షనీయమన్నారు. అయితే ఇదివరకు ఆయన చేతుల మీదుగానే శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. తిరిగి అదే అమరావతి శంకుస్థాపన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శంకుస్థాపన చేసి 10 సంవత్సరాలు అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా,రాయలసీమ,ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యం లో ఉక్కు కర్మాగారం,దుగరాజ పట్నం ఓడ రేవు తదితర అంశాలన్నీ అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మే 2 న శంకుస్థాపన సందర్భంగా పైన పేర్కొన్న అంశాలపై ప్రధాన మంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు నిస్సార్ అహ్మద్, ప్రభాకర్, గంగయ్య, అనిల్ కుమార్, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఛైర్మన్, కమిషనర్

## మరువ కాలువను ఆక్రమిస్తే చర్యలు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలో శ్రీకంఠాపురం మరువ కాలువ పరిసరాల్లో ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఇరిగేషన్ డి.ఈ. యోగానంద హెచ్చరించారు. ఈ మేరకు వారు మంగళవారం శ్రీకంఠాపురం మరువ కాలువను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గిరీష్, సాగునీటి సంఘం అధ్యక్షులు వెంకటేష్, ఎంహెచ్ఓ శోభన్ రెడ్డి, డిఈఈ వాణి, ఏఈలు జనార్ధన్, ధీరజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్స్‌లో కదిరి యువకుడి సత్తా

### జాతీయ స్థాయిలో 918వ ర్యాంక్

**ప్రజాశక్తి - కదిరి టౌన్**



షణ్ముఖం

అఖిల భారత సర్వీసుల నియామకాలలో భాగంగా యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ 2024 తుది ఫలితాలలో. కదిరికి చెందిన విశ్రాంత ఎఎస్ఐ నర సింహులు కుమారుడు షణ్ముఖం 918వ ర్యాంకు సాధించారు. తమ కుమారుడు జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సివిల్ లో సత్తా చాటిన యువకుడిని స్థానికులు అభినందించారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి



అధికారులతో మాట్లాడుతున్న కాలనీలవాసులు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

లోవోల్టేజీ సమస్యతో విసిగిపోయిన మండలకేంద్రంలోని ప్రజలు స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను మంగళవారం ముట్టడించారు. పాత ఆంధ్ర బ్యాంకు వెనుక ఉన్న బోయ కాలనీ, మేదర వీధి, ముస్లిం కాలనీల్లో చాలారోజులుగా లోవోల్టేజీ సమస్య ఉంది. దీంతో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన వారు పట్టించకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు మంగళవారం విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు మాట్లాడుతూ ఉర్దూ స్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సరిగా పనిచేయకపోవటంతో లో వోల్టేజ్ సమస్య నెలకొందన్నారు. వేసవికాలంలో ఇళ్లల్లో ఉండలేక చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్తు సమస్యతో ఇళ్లలోని ఫ్రిడ్జిలు, టీవీలు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోతున్నాయన్నారు. అధికారులు పట్టించుకోకపోవటంతో ఆందోళకు దిగాల్సివచ్చిందన్నారు. స్పందించిన ట్రాన్స్‌కో ఎఇ వెంకటేష్ నాయక్ ప్రజలతో మాట్లాడారు. సమస్యను జిల్లా విద్యుత్ అధికారులకు నివేదించామని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు కేశవ, నారాయణస్వామి, టైలర్ కేసవ, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.



కరాటే విద్యార్థులతో కరాటే మాస్టర్లు

## లోటస్ పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు వద్ద ఉన్న లోటస్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మంగళవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి.జీవిత, ఆర్.తన్వితరెడ్డి లు గ్రీన్ బెల్ట్, మేఘన, జాహ్నవి, తనూషలు ఆరెంజ్ బెల్ట్, పావని ఎల్లో బెల్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, మాస్టర్ జనార్దన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యులు కావాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

ఎండిఎ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి నైపుణ్యం ప్రదర్శించి, వ్యాపారవేత్తలుగా ఎదిగి దేశ ఆర్థిక ప్రగతిలో బాగస్వామ్యులు కావాలి కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎస్ డి జి ఎస్, ఎంబీఏ కళాశాలలో జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతు ఘనంగా ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు.



సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఈ సందర్భంగాకళాశాల ప్రిన్సిపల్ గాక్టర్ నాగేంద్ర కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలోకళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ దాసా సురేష్, కమిటీ సభ్యులు రమేష్ బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిజిఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జేఎస్వీఎస్ ప్రసాద్, ఎంబిఎ హెచ్ఒడి అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచారు. ముంబైకి చెందిన ద డ్రీమ్ సంస్థ ఈ నెల 2వ తేదీన కొట్నూరు పాఠశాలలో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించింది.



ప్రతిభ కనబర్చిన వారికి మెమొంటో అందిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో కార్యక్రమం నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన 9వ తరగతి విద్యార్థిని లక్ష్మీ వాసుకి, రెండవ స్థానాన్ని సంపాదించిన 7వ తరగతి విద్యార్థిని కౌసల్య, మూడవ స్థానంలో ఉన్న 6వ తరగతి విద్యార్థి దనేంద్రాచారి, నాల్గవ స్థానంలో ఉన్న 4వ తరగతి విద్యార్థిని చందనకు మెమోంటోలను అందించారు. అలాగే 31 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 150 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎసీ ప్రధానోపాధ్యాయురాలు కమలమ్మ, చిత్రలేఖనం ఉపాధ్యాయులు పాండురంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంజిఎం విద్యార్థులు

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోనిఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-14 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఎంజీఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గగనశ్రీ బాలికల జట్టుకు, 7వ తరగతికి చెందిన లోకేష్ బాబు బాలుర జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 25వ తేది నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్లో జరిగే జాతీయ స్థాయి ఫుట్బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహించిన వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పీడీ లోకానాథ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, పీడీలు లోకనాథ్, సురేష్, విలియమ్స్, రాణి, ప్రవీణ, ఉపాధ్యాయులు అభినందించారు.



గగన



లోకేష్ బాబు

# నీటి సరఫరాను మెరుగుపరుస్తాం

## మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

**ప్రజాశక్తి-హిందూపురం**

పురపాలక సంఘ వ్యాప్తంగా నీటి సరఫరాను మెరుగు పర్చడంతో పాటు పట్టణంలో ఉన్న ప్రతి పోల్ కి ఎల్ఈడి బల్బులను అమర్చడానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. పురపాలక సంఘంలోని కరువు నిధుల నుండి రూ.2కోట్లతో నూతనంగా కొనుగోలు చేసిన నీటి సరఫరా పైప్ లైన్ సామాగ్రి, ఎల్ఈడి బల్బులు కాంట్రాక్టర్ తీసుకొచ్చారు. వాటిని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి ఛైర్మన్ రమేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతు హిందూపురం పట్టణంలో నీటిసరా వ్యవస్థను మరింత మెరుగుపర్చుతామని అన్నారు.